క్లుప్తంగా

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలోని స్థానిక బీసీ కాలనీలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఆదివారం 5వ తరగతి, 6 నుంచి 10వ తరగతి ప్రవేశం కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ శౌరీలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 714 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న అనితనాయక్

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని సుద్ద బాయితండాకు చెందిన కేతావత్ అనితనాయక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకుంది. 'ఇంప్యూరిటీ ప్రొఫైలింగ్ అండ్ స్టెబిలిటీ ఇండికేటింగ్ మెథడ్ డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ సెలక్టెడ్ డ్రగ్స్' అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా అందుకుంది. భర్త ప్రోత్సాహంతో డిగ్రీ ఆపై పీపీ పూర్తి చేయడంతో పాటు నెట్, సెట్ అర్హత సాధించింది. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్, ఆ తర్వాత గురుకుల టీజీటీ, పీజీటి ఉద్యోగాలు సాధించింది. ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో డిగ్రీ అధ్యాపకురాలిగా కొనసాగుతుంది. పీహెచ్‌డీ పట్టా అందుకోవడంపై తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన

మిర్యాలగూడ : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టులు నిరసన తెలపనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అయూబ్ అన్నారు. శనివారం ఆయన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.వెంకన్న, మనోజ్‌లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్టులంతా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజా హమీదొద్దిన్, వెంకన్న, మనోజ్, మహేష్, ఖాజా నాజీమొద్దీన్, మంద సైదులు, జయరాజు, నక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తనందికొండ మాజీ సర్పంచ్ మృతి



బాలునాయక్ (ఫైల్)

అడవిదేవులపల్లి : మండలంలోని కొత్తనందికొండ గ్రామ మాజీ సర్పంచ్ రమావత్ బాలునాయక్(55) ఆనారోగ్యంతో శనివారం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మాజీ సర్పంచ్ బాలునాయక్ మృతిపై మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, కాంగ్రెస్ నాయకులు చిన రామయ్య, మంగమ్మలు సంతాపం ప్రకటించారు.

సృజనాత్మకతతో కూడిన విద్య అందించాలి

మిర్యాలగూడ : సృజనాత్మకతతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని కాకతీయ పాఠశాల డైరెక్టర్ చీదళ్ల వెంకట్ అన్నారు. శనివారం ఆ పాఠశాలలో నర్సరీ నుంచి ఐదో తరగతి విద్యార్థులు తమ నైపుణ్యాలతో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మాథ్స్, సైన్స్‌తోపాటు ప్రస్తుత పరిస్థితుల మీద ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి చెన్నాయిపాలెం గెజిటెడ్ హెచ్‌ఎం యు.సైదిరెడ్డి, ఉపాధ్యాయులు ఎం.నర్సింహాస్వామి, జి.నర్సింహాలు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

పెద్దవూర : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఇంటర్, పదోతరగతి విద్యార్థినులకు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, పదవ తరగతి విద్యార్థినులు పాఠశాలలో తమ అనుభూతులను, అనుభవాలను పంచుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థినులు చేసిన డ్యాన్స్‌లు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి జ్యోత్స్న, పీజీసీఆర్‌టీలు మంజుల, అనుష, వరలక్ష్మి, సువర్ణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్ననీటి వనరులపై నిర్లక్ష్యం!

- నిలిచిన చెక్‌డ్యాంలు, ఫీడర్ చానళ్ల నిర్మాణాలు
- మూడేళ్ల కిందట నిలిచిన పనులు
- వేసవిలో పూర్తి చేయాలని కోరుతున్న రైతులు



కట్టవారిగూడెం వద్ద శశిలేటి వాగుపై అసంపూర్తిగా చెక్‌డ్యాం నిర్మాణం



పోచంపల్లి వద్ద నిలిచిన ఫీడర్ చానల్ నిర్మాణం

గుర్రంపోడు : శశిలేటివాగుపై చేపట్టిన చెక్ డ్యాం నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. మండలంలోని కట్టవారిగూడెం, కొత్తలాపురం గ్రామాల ప్రక్కనే గల శశిలేటివాగుపై రూ.4కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టారు. గత వేసవిలోగా పనులు పూర్తికావల్సి ఉండగా రెండు చెక్‌డ్యాంల నిర్మాణ పనులు 50శాతం మేర పూర్తయి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మర్రిగూడెం మండలం నుంచి ప్రవహిస్తూ గుర్రంపోడు ప్రక్కగుండా వెళ్తున్న శశిలేటి వాగుపై చెక్‌డ్యాం నిర్మాణాలు దశాబ్దాల క్రితమే కొన్ని చోట్ల నిర్మాణాలు జరగగా అవి శిథిలయమయ్యాయి. శశిలేటి వాగుపై చామలే డు గ్రామ పై భాగంలో వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం, ఫీడర్‌చానళ్ల నిర్మాణాలు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మత్తులకు నిధుల మంజూరుకు నోచుకోవడం లేదు.

నిలిచిన చెక్ డ్యాంల నిర్మాణాలు

మండల పరిధిలోని కట్టవారిగూడెం, కొత్తలాపురం గ్రామాల పరిధిలో శశిలేటి వాగుపై నిర్మిస్తున్న రెండు చెక్‌డ్యాంల పనులు అర్ధాంతరంగా నిలిచాయి. గత వేసవి నాటికి పనులు పూర్తికావల్సి ఉంది. వాగులో జరిగే వీటి నిర్మాణాలు వేసవి కాలంలో మాత్రమే పనులు జరిపించాల్సి ఉంటుంది. కంట్రాక్టర్లకు బిల్లులు ఆలస్యం కావడంతో పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని తెలస్తుంది. వర్షాకాలంలో వాగు జీవనదిలా ప్రవహించినా వేసవి వచ్చే నాటిని నిరంతరం కరెంటు, వాగు వెంట గల విచ్చలవిడి బోర్లతో వేసవి నాటికే తక్కువ లోతులోని వాగు బోర్లు నీరందించని పరిస్థితి ఏర్పడుతుంది.

నిధులు మంజూరైనా..

వర్షాకాలంలో జీవనదిలా పారే శశిలేటి వాగుపై పోచంపల్లి గ్రామం ఎగువన నర్సింహులుగూడెం వద్ద వాగుపై చెక్‌డ్యాంను నిర్మించి ఫీడర్‌చానల్ ద్వారా చెరువుల్లోకి వాగు నీటిని మళ్లించాలని 2012లో రూ.2కోట్ల నిధులు మంజూరయ్యాయి. పోచంపల్లితోపాటు వట్టికోడు, కస్తాల చెరువులను నింపడం ద్వారా పరిసర గ్రామాల్లోనూ శాశ్వత నీటి వనరులను అభివృద్ధిచేసేందుకు ఉద్దేశించారు. భూసేకరణ జరగకపోవడంలో కంట్రాక్టరు అతికష్టం మీద ఎనిమిది కిలోమీటర్ల ఫీడర్‌చానల్‌ను తవ్వి మధ్యలో బ్రిడ్జి నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపివేశాడు. మధ్యలో రైతులు భూసేకరణ విషయమై అభ్యంతరం తెల్పిన చోట్ల కాల్వ త్రవ్వకం జరగలేదు. ఏడాదిలోనే కంట్రాక్టరు పనిని మధ్యలోనే అర్ధాంతరంగా నిలిపివేయగా ఇంతవరకు మళ్లీ అతీగతీ లేదు. అధికారులు కంట్రాక్టరు చేసిన పనికి బిల్లులు చెల్లించి మళ్లీ పట్టించుకోలేదు. చెక్‌డ్యాం నిర్మాణం ప్రారంభమే కాలేదు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం



చెక్ డ్యాం నిర్మాణంతోపాటు కట్టవారిగూడెం శ్మశాన వాటిక వరకు మట్టి కట్ట నిర్మించాల్సి ఉంది. మట్టికట్టను నిర్మించితే పక్కనే ఉన్న పొలాలు నీట మునగకుండా ఉండి చెక్‌డ్యాంలో నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుంది. ప్రస్తుత వేసవిలోనైనా పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చాడ చక్రవర్తి, మాజీ సర్పంచ్, కట్టవారిగూడెం

వేసవిలో పనులు పూర్తి చేయిస్తాం

చెక్‌డ్యాంల నిర్మాణాలకు సంబంధించి కాంట్రాక్టర్లకు గతంలోనే నోటీసులు ఇచ్చాం. వేసవిలో మాత్రమే సాధ్యమయ్యే చెక్‌డ్యాం నిర్మాణాలు పూర్తి చేసేందుకు కంట్రాక్టర్లు ఇటీవల వచ్చి పరిశీలించి చెక్‌డ్యాంల పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వేసవిలో కట్టవారగూడెం, కొత్తలాపురం చెక్ డ్యాంల నిర్మాణాలు పూర్తి చేయిస్తాం. పోంచపల్లి గ్రామ పరిధిలో నిలిచిన చెక్‌డ్యాం నిర్మాణానికి నిధులకు గతంలోనే ప్రతిపాదనలు పంపించాం.

– శ్రీనివాసరావు ఏఈఈ నీటిపారుదల శాఖ

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



పెద్దఅడిశర్లపల్లి : యల్లాపురంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి : దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం మండలంలోని యల్లాపురంలో సీతారామాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

డిండి : ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గోన బోయనపల్లిలో నిర్వహించిన గంగా భవనీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు హరికృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీను, మాజీ సర్పంచ్ లక్ష్మి తిర్పతి నాయక్, కొండలు,మోహన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి

కొండమల్లేపల్లి : దైవ చింతన అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చునని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని గుంటిమడుగు గ్రామంలో నిర్వహించిన శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్ రెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

మతసామరస్యం వెల్లువిరిసేలా..

- ఒకేసారి హజరత్ అబ్బాస్ దర్గా ఉర్సు..శివపార్వతుల కల్యాణం
- ఒంటెపై గంధం ఊరేగింపు
- ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు



ఒంటెపై గంధం ఊరేగిస్తున్న భక్తులు

చింతపల్లి : నల్లగొండ జిల్లాలో రెండవ జహన్ పాడుగా పేరుగాంచిన చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి హజరత్ అబ్బాస్ దర్గా షరీఫ్ గంధం ఊరేగింపు శుక్రవారం రాత్రి 12 గంటలకు ప్రారంభమై శనివారం తెల్లవారుజామున 5గంటల వరకు గ్రామ పురవీధులలో డబ్బు చప్పులతో ఘనంగా కొనసాగింది. దర్గా ముతవలీ లతీఫ్ సాహెబ్ ఇంటి నుండి ఒంటెపై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గా వద్ద గంధాన్ని సమర్పించారు. ఉత్సవాలను తిలకించేందుకు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నల్లగొండ జిల్లానే కాకుండా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు హైదరాబాద్, రంగారెడ్డి, నగర్ కర్నూల్, మెదక్ తదితర జిల్లాల నుండి భక్తులు వేల సంఖ్యలో హాజరై దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనుల పండవగా కల్యాణం

దర్గా కింది భాగంలో ఉర్సు ఉత్సవాలు కొనసాగుతుండగా పైభాగంలో శనివారం ఉదయం శివపార్వతుల కల్యాణం కన్నుల పండుగగా కొనసాగింది. దర్గా వద్ద పూజలు నిర్వహించిన భక్తులు కొండపై ఉన్న శివపార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ హిందూ ముస్లింలు ఐక్యతగా దర్గా, శివాలయాలలో పూజలు నిర్వహిస్తుండడంతో కులమతాలకు ఐక్యతగా పీకే మల్లేపల్లి దర్గా నిలుస్తుంది. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నాంపల్లి సీఐ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మర్రిగూడ, నాంపల్లి, చింతపల్లి ఎస్ ఐ లతోపాటు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కృష్ణా జలాలను తరలిస్తున్నా పట్టించుకోరా!

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : ఆంధ్రా పాలకులు కృష్ణా జలాలను తరలించుకపోతున్న తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శనివారం హాలియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలన మీద అనుభవం లేనటువంటి ముఖ్యమంత్రి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందన్నారు. ముఖ్యంగా కృష్ణ జలాల విషయంలో పునర్విభజన జరిగినప్పుడు ఆంధ్ర ప్రాంతాలనికి ఎంత? తెలంగాణ ప్రాంతానికి ఎంత అని తాత్కాలిక ఒప్పందం చేశారని, దాన్ని ఉల్లంఘించి నేడు ఆంధ్ర పాలకులు కేంద్ర ప్రభుత్వ సహకారంతోటి కేఆర్‌ఎంబీనీ మభ్య పెట్టి నీటిని తీసుకుపోవడం జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు, జిల్లా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రెస్ మీట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తిన తరువాత ఈ ప్రభుత్వం అప్పటికప్పుడు లేఖ తయారు చేసి కేఆర్‌ఎంబీకి పంపించినట్లు తెలిపారు. మన జిల్లాకు నీటి పారుదల శాఖ మంత్రి ఉన్నా నీటి కష్టాలు తప్పడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ రైతుల పక్షాన ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎక్కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించండి

మిర్యాలగూడ : బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాధినేని శ్రీనివాస్‌రావు కోరారు. శనివారం దామరచర్ల ఆయన పలు ప్రభుత్వ, గురుకుల పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం, ప్రస్తుతం ప్రభుత్వం విఫలమైందన్నారు.ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, జానకిరాంరెడ్డి, సైదారావు, పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న భక్తులు

హాలియా : పట్టణంలోని స్వయంభూ శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆలయంలో పూజలు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ నంది వెలుగు శ్రీబాలాజీ గురుకల్, త్రిశతాధిక ప్రతిష్ఠాచార్యుల రేపల్లె బృందం సపతి ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున నీటిని జలాధివాసంలో ఉంచిన స్వామి వారికి పోశారు. ద్వారకామాయి భజనమండలి, కుకట్‌పల్లి ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసాను సుమారు ఐదు గంటల పాటు ఆలపించడం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ మేడిపల్లి మోహన్‌రావు, గౌరవ అధ్యక్షుడు కాకునూరి నారాయణ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త చిట్టిపోలు యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్, ఆలయ కమిటీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి వెంకన్న, బాలకృష్ణ, గౌనీ రాజా రమేష్ యాదవ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

పట్టుదలతో ఆడితే విజయం సాధించొచ్చు



బహుమతులు అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : క్రీడాకారుల్లో పట్టుదల, కృషి ఉంటే విజయం సాధించొచ్చని ఎస్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని క్లియో స్టేడియంలో జిల్లా స్థాయి అండర్–14, 17 కబడీ ఫైనల్స్ సందర్భంగా ఆయన హాజరై విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 14, 15, 17వ వార్డుల మాజీ కౌన్సిలర్లు రామకృష్ణ, రుణాల్‌రెడ్డి, రవినాయక్, శాస్త్రస్కూల్, చైతన్య స్కూల్ కరస్పాండెంట్స్‌లు శ్రీధర్‌రెడ్డి, నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు. ఈ సందర్భంగా ప్రతిభాను కనబరిచిన శాస్త్ర స్కూల్ విద్యార్థులను ఆ పాఠశాల చైర్మన్ ఎం. చంద్రశేఖర్, కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డిలు అభినందించారు.

ఫౌంటెన్‌ను తలపించేలా..

- భగీరథ పైప్‌లైన్ ఏయిర్ వాల్వ్ ధ్వంసం



ఎగిసిపడుతున్న భగీరథ నీరు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని జడ్చర్ల – కోదాడ జాతీయ రహదారిపై ఏఎమ్మార్పీ ప్రధాన గేటు సమీపంలో శనివారం రోడ్డు వెంట జియో ఫైబర్ నెట్‌వర్క్ పనులు చేపడుతుండగా మిషన్ భగీరథ ఏయిర్ వాల్వ్ ధ్వంసం కావడంతో ఒక్కసారిగా నీరు ఫౌంటెన్ తలపించేలా ఎగసిపడ్డాయి. దీంతో రోడ్డు వెంట వెళ్తున్న వాహనాలకు కొంత మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు ఈ దృశ్యాన్ని కెమెరాలతో బంధించారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఎదగాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో తమ కాళ్లమీద తాము నిలబడి బ్రతికేలా తోడ్పాటు అందిస్తామని ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ రఘుపతి అన్నారు. మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఈ నెల 13నుంచి ఎనేబుల్ ఇండియా, ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ సహకారంతో దివ్యాంగుల వ్యాపార నైపుణ్యాభివృద్ధిపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో శనివారం పాల్గొని మాట్లాడారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న దివ్యాంగులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఓఆర్‌ఓ భూషయ్య, విద్యులత, మేనేజర్ మల్లిఖార్జున్, మధుయాదవ్, కిరణ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



డెస్క్ బెంచీలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

హాలియా : ప్రభుత్వ పాఠశాలలకు దాతలు సహకారం అందించడం అభినందనీయమని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమా నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ నల్లగొండ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో లయన్ యుగేందర్‌రెడ్డి, భారతి సహకారంతో ఇబ్రహీంపేట ప్రాథమిక పాఠశాలకు 10డ్యూయల్ డెస్క్ బెంచీలను బహూకరించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాత కీసర యుగేందర్‌రెడ్డి, లయన్ డిస్ట్రిక్ట్ 320 సెక్రటరీ శివశంకర్ రావు, సింహాద్రి, ట్రెజర్ మురళీధర్‌రెడ్డి, జీఎస్‌టీ కో ఆర్డినేటర్ కట్ట అనంతరెడ్డి, మార్కెటింగ్ కోఆర్డినేటర్ అలుగుబెల్లి ఆదిరెడ్డి, జోన్ చైర్‌పర్సన్ వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కొండ శ్రీనివాస్, క్లబ్ సెక్రటరీ బండ నర్సిరెడ్డి, లైయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి : విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం అలవర్చుకోవాలని ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బధిరుల శిక్షణ కేంద్రానికి రూ.20వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపధ్యాయులు మల్లెల జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, అశోక్‌కుమార్, జాన్‌నాయక్, శివ ప్రసాద్‌రెడ్డి, బాలాజి, వెంకట్, నాగార్జున, బాబు, పాల్గొన్నారు.

డీపీఓకు పంచాయతీ కార్యదర్శుల వినతి

కొండమల్లేపల్లి : జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శులపై తప్పుడు వార్తలు రాస్తున్న వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడు కత్తుల మధు అన్నారు. ఈ మేరకు టీపీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీపీఓ వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తూనే సర్పంచ్‌లు లేకపోవడంతో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై నిరాధారమైన వార్తలు రాయడం సబబు కాదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో శైలజ, నరేష్‌యాదవ్, వెంకన్న, రామకష్ణ, రమేష్, అశోక్‌మహారాజ్, వాసుదేవ్, జానకి రాములు, జగదీష్, సైదామియా, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ మహరాజ్‌కు నివాళి



అడవిదేవులపల్లి : సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి : మండలంలోని జిలకరకుంటతండా గ్రామ పంచాయతీ పరిధిలోని హామ్ తండాలో శనివారం గిరిజనుల ఆరాధ్యదైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తండాలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, గిరిజన సంఘం నేత స్కైలాబ్‌నాయక్, మోతిలాల్, శ్రీనునాయక్, హాము, సర్దార్ తదితరులున్నారు.

పెద్దఅడిశర్లపల్లి : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడవాలని బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు బోడ్యానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు బోడ్యానాయక్, కార్యదర్శి రాంచంద్రూనాయక్, నారాయణ,గాసీరాం, లచ్చిరాంనాయక్, పాండునాయక్, చందూనాయక్,లక్ష్మణ్‌నాయక్, శ్రీరాంనాయక్, రాముడునాయక్, దస్రూనాయక్,రఘునాయక్,రాజునాయక్, తదితరులున్నారు.

ఏళ్ల నాటి వృక్షం నరికివేత



నరికి వేసిన ఏళ్లనాటి వృక్షం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఉన్న దశాబ్దాల కాలం నాటి వృక్షం నేలమట్టమయింది. ఎన్నో ఏళ్లకాలం నాటిన చెట్టు ఆనవాళ్లను కోల్పోయింది. ఆ అధికారిని ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నాటిన వృక్షాన్ని ఎందుకు నరుకుతున్నారని మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ మంద రఘువీర్ అడిగితే తాము ఆడుకోవడానికి ఈ వృక్షం అడ్డు వస్తుందని అందుకే నరికివేశామని సమాధానం చెప్పినట్లు పేర్కొన్నాడు. దశాబ్దాల కాలం నుంచి ఎవరికి అడ్డురాని వృక్షం మీకెలా అడ్డువస్తుందని ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వాపోయాడు. ఒక భారీ వృక్షాన్ని తొలగించాలంటే అటవీశాఖ అనుమతి తప్పక తీసుకోవాలని, అనుమతి లేకుండా ఎలా తొలగిస్తారని చెప్పినా వినలేదని తెలిపారు. ఈ వృక్షాన్ని నరికివేసిన అధికారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలి

వేములపల్లి : ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని సీడీపీఓ చంద్రకళ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 'బేటీ బచావో– బేటీ పడావో' కార్యక్రంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఆడపిల్లలు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కిశోర బాలికలు నిత్యం పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు దూరంగా ఉంటారన్నారు. అదేవిధంగా బాల్య వివాహాలు, ఆడపిల్లల హక్కులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు నయిమున్నీసా, షబానా, చంద్ర, సూపర్‌వైజర్లు రజిని, లక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు జయమ్మ, శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



మిర్యాలగూడ టౌన్ : శిష్య పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



మిర్యాలగూడ టౌన్ : ఈదులగూడెం ప్రాథమిక పాఠశాలలో..



పెద్దవూర : శాంతినికేతన్ గురుకుల పాఠశాలలో..

మిర్యాలగూడ టౌన్, పెద్దవూర, : మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, పట్టణంలోని శిష్య పాఠశాలలో, పెద్దవూర మండల కేంద్రంలోని శాంతినికేతన్ గురుకుల పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా వ్యవహరించి పలువురిని ఆకట్టుకున్నారు.